# డాబా యిల్లు

"ఆయె బరసాత్ మే"

"ఓరి యదవా — తెలుగుపాట యెయ్యరా ?"

"నువ్వ్వారికోయే బాలమ్మా........"

"వూరుకుంటా ! పైసలన్నీ వాడి ఎదాన పోస్తివి. ఏందిరా తెలుగు ఎయ్యరా ?"

రాజయ్య రికార్డు మార్చి, "రాదే చెలీ నమ్మరాదే చెలీ" వేస్తాడు.

o o o o

వారంరోజు లయింది నేనా వూరువచ్చి. సాయంత్రం ఆరు అయ్యే వేళకి ఈ రికార్డుల భాగోతం ప్రారంభం అవుతుంది. మా డాబాకి ఎదురుగుండా పూరిల్లు, ఇంటిముందు చిన్న మట్టి అరుగులు, పేడతో నున్నగా గచ్చులా అలికిన ముందువాకిట్లో, చినిగిన గొంగళీ పరుచుకుకూచుని రాజయ్య గ్రామఫోను మోగిస్తూవుంటాడు. బాలమ్మ మట్టి అరుగుమీద కూర్చుని బియ్యంలో రాళ్ళు ఏరుతూ వుంటుంది. ప్రొద్దుటనుంచీ బందిఖనాలోవున్న కోడిపెట్టలు సాయంత్రం వేళ స్వేచ్ఛగా రాజయ్య బాలమ్మల చుట్టూ తిరుగుతుంటాయి.

వారంరోజులనుంచీ, ప్రతి సాయంత్రం ఈ కార్యక్రమాన్ని పరిశీలిస్తూనే వున్నాను. అక్కయ్య కింద వంట చేస్తూవుంటే, నేను చల్లగాలికి డాబామీద కూచుని, పుస్తకం చదువుకోవాలని ప్రయత్నించేదాన్ని. పుస్తకంలో ఒక పుట తిరిగేదో లేదో — రాజయ్య 'ఆయె బరసాత్ మే' అని అరిగిపోయిన ప్లేటుని పదేపదే వేస్తూండేవాడు. ఎంత మంచి పాటయినా అన్నిసార్లు ఎక్కడ వినగలం ?

అలా రాజయ్య వేసే రికార్డూ, ఆ రికార్డుతోపాటు కోళ్ళు చేసే కొక్కొరొ గింతలూ, ఈ రెంటినీమించిన స్థాయిలో వుండే బాలమ్మ తిట్లూ, వీటితో నా చదువు ఏమాత్రం సాగేదికాదు. కొంతసేపు రాజయ్యనీ, మరికొంతసేపు ఇంకెవరో మనిషిని గుక్కతిప్పుకోకుండా తిట్టేది బాలమ్మ.

దూరాన బంజారాహిల్స్‌లోని పెద్దపెద్ద మేడల్లోంచి దీపాల తోరణాలు కనపడేవి డాబామీద నిల్చుంటే. మా డాబాను ఆనుకుని పెద్ద శిలలు ఒకదానిమీద మరొకటి కొంచెం అంటీఅంటనట్లుగా వుండేవి. ఆ రాళ్ళని చూస్తే నాకు భయంవేసేది. అందులో ఒకటి కాస్త జారిగి మా ఇంటిమీద పడితే ఇంకేముంది? ఆ గండశిలలు అక్కడ చెక్కుచెదరకుండా ఏభై ఏళ్ళబట్టీ వున్నాయట. ఒకవంక దెయ్యాలంటి బండరాళ్ళు, మరొకవంక చెవులుగింగురు మనే 'ఆయె బరసాత్ మే' ఏంచదువు సాగుతుంది? ఆఖరికి దూరాన కొండలవెనక దాక్కునే సూర్యుణ్ణికూడా ప్రశాంతంగా చూడలేకపోయేదాన్ని - ఆ తిట్లూ ఏడుపుల మధ్య!

◆ ◆ ◆

బావగారికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయ్యాక నాకు ఆహ్వానంమీద ఆహ్వానం పంపారు. ఆరు నెలలపాటు పిలిపించుకుని పోయిన డిశంబరులో వెళ్ళాను. ఖైరతాబాద్‌లో ఒక చిన్నసందులో మావాళ్ళ ఇల్లు; డాబాయిల్లు మనం సందు అంటాంగాని వాళ్ళు గల్లీ అంటారు. ఆ గల్లీకూడా మా ఇంటితో టే అంతమవుతుంది. ఆ ఇరుకుసందులో మా దొక్కటే కాస్త పెద్ద ఇల్లు. చుట్టూ పూరికొంపలున్నా, మావాళ్ళ ఇల్లు లోపల చాలా సౌకర్యంగావుంది.

ఇంట్లో పాచిపని, గిన్నెలు తోమటం, ఇల్లూ వూడవటం వగయిరా - ఎదుటి పూరింట్లోవున్న రాజయ్యగాని, బాలమ్మగాని వచ్చి చేస్తూండేవారు. బాలమ్మ తెల్లారిగట్ట నాలుగింటికి లేచి వీధివాకిలంతా పేడతో నున్నగా, నల్లగచ్చులా అలికి చక్కని ముగ్గులుపెట్టేది. రాజయ్య ప్రతి వుదయం ఇళ్ళన్నీ దులిపి, నెమ్మదిగా అతినెమ్మదిగా వూడిచేవాడు. అతను వూడుస్తుంటే నేలని ఎంతో ప్రేమతో తాకుతున్నట్టుండేదిగాని దుమ్ము వూడుస్తున్నట్టు వుండేదికాదు. ఇంట్లో పాచిపని చేస్తున్నాసరే అక్కా బావా, రాజయ్య బాలమ్మని గౌరవంగా చూసేవారు. అంతేకాదు, వాళ్ళంటే భయపడేవారుకూడాను. మావాళ్ళు భయపడతారన్న సంగతి ఒకనాటి వుదయం జరిగిన సంఘటనవల్ల నాకు తెలియవచ్చింది.

పొద్దుటే కాఫీ సేవించాక మేకూ సుత్తీ పుచ్చుకుని, గడిచిన సాయంత్రం ఎగ్జిబిషన్‌లో కొన్న ఠాగూర్ బొమ్మని 'మీ ఇంటికి అలంకారం సుమండీ' అని బావగారితో అంటూ

డ్రాయింగ్‌రూమ్‌లో గోడకి కొడుతున్నాను. ఎక్కడినుంచో గాలివానలా వచ్చిపడ్డాడు రాజయ్య గుమ్మంలో.

"ఏందమ్మా - చప్పుడు చేస్తుండవు?" అన్నాడు నా వంక కోపంగా చూస్తూ.

"ఏమీ లేదు" అన్నాను నిర్లక్ష్యంగా. వాడెవడు నన్ను ప్రశ్నించేందుకు?

"అదేందమ్మా - గోడని అట్టా కొడుతుండవు. లే - లేమ్మా" అన్నాడు అథార్టీగా.

"నీ కెందుకు? పో" అనబోయాను వొళ్ళుమండి.

ఇంతలోకే వంటింట్లోంచి అక్కయ్యా, బాత్‌రూమ్‌లోంచి బావగారూ వచ్చారు, ఏదో గడబిడ జరుగుతోందని.

"ఏమటే?" అంది అక్క నన్ను వుద్దేశించి.

"ఏమీ లేదు, మేకు కొడుతున్నాను. అతనెవరు కొట్టవద్దని చెప్పేందుకు?"

"చూడయ్యా - అమ్మాయిగారిని కొట్టొద్దంటే కొడతాంది. ఇల్లు పాడవుద్ది" అన్నాడు రాజయ్య బావగారితో.

"నే చెప్తాలే. నువ్వు వెళ్ళు రాజయ్యా" అంటూ ఆ పూటకి నన్ను మేకుకొట్టకుండా చేశారు బావగారు.

నాకుమటుకు బుర్రబద్దలు కొట్టుకున్నా అక్కా బావ రాజయ్య మాటల్ని ఎందుకంత సీరియస్‌గా తీసుకున్నారో అర్థంకాలేదు. గోడకి మేకుకొడితే ఇంటివాళ్ళు వచ్చి దెబ్బలాడటం, అద్దెకున్నవాళ్ళు భయపడటం సర్వసామాన్యమైన

విషయం. అంతేగాని నౌకరీవాడికి భయపడటం నే నెక్కడా చూడలేదు.

*  *  *

ఆ నాలుగోనాడు సాయంత్రం డాబామీద నిల్చుని వున్నాను. అక్క వంటింట్లో పని చేసుకుంటోంది. బావగారు ఆఫీసునుంచి ఇంకా రాలేదు. ఎదురుగ్గా ప్రతిరోజూ నేను చూసే దృశ్యం కనపడుతోంది. కాని గ్రామఫోనుమటుకు మోగడంలేదు. రాజయ్యా చుట్టముక్క వెలిగించి, అరుగు మీద కూచున్నాడు. బాలమ్మ గుమ్మంలో కూచుని ఎవరినో తిడుతూ, మధ్య మధ్య ఏడుస్తూ బియ్యంలో రాళ్ళు ఏరుతోంది.

దూరాన, అంటే సందు మొగిని, బావగారి హాటు నా కంటబడింది. బావగారికి 'వేవ్' చేస్తూ నిల్చున్నాను—పిట్ట గోడమీదకి వరిగి రాజయ్యా చుట్టపారేసి చేతులు కట్టుకు, సవినయంగా నిల్చున్నాడు. సన్నగా కడ్డీలా వుంటాడు రాజయ్యా. మనిషికి యాభై పైబడ్డాయని చెప్పవచ్చు. పంచె ఎప్పుడూ మోకాళ్ళమీదికి వుంటుంది. గళ్ళతలపాగా చుట్టు కుని, నీలంరంగు చొక్కా వేసుకు నిల్చుని వున్నాడు రాజయ్యా.

కంఠం లాగానే బాలమ్మ ఆకారంకూడా కాస్తపెద్దదే. మనిషి నల్లగా, లావుగా, పొట్టిగా వుంటుంది. గళ్ళచీర గోచీ పోసి కట్టుకుంటుంది. చేతికి పట్టుగాజులు. ముఖాన్ని పావలా

కాసంత కుంకుంబొట్టు. నలభైపయిన వుంటుంది వయస్సు. బుజంమీద పమిటని తలమీదకు లాక్కుంటూ, చేటని గుమ్మంలోకి తోసి గడపదగ్గర నిల్చుంది బాలమ్మ.

బావగారు మా గుమ్మందగ్గరకు రాగానే "అయ్యా, పైసలు చెల్లగడితివా ఆడికి" అన్నాడు రాజయ్య.

"ఆ—యిచ్చానోయ్," అన్నారు బావగారు చిరునవ్వుతో.

"ఎంతగడితివి?" అడిగాడు రాజయ్య,

"మామూలుగానే-75 రూపాయలూ యిచ్చాను," అంటూ మెట్లెక్కారు బావగారు.

రాజయ్య తన జేబులోంచి చుట్టతీసి అంటించి, మేడవంక పరకాయించి చూస్తున్నాడు. వెనకనించి బాలమ్మ అందుకుంది.

"పైసలన్నీ ఆడికే బోయెనే-ఇల్లుగూడా ఆడికే బోయెనే—నీతో వచ్చిందికాగా ఇట్ట చెడితిని—నా బంగారమంతా మన్నుపాలాయెనే" అని బాలమ్మ పెద్దగా ఏడుపు అందుకుంది. కొంతసేపు రాజయ్య ఏదో బతిమిలాడాడు; ఆపైన దబదబ మోదాడు. బాలమ్మ మరీ పెద్దగా ఏడ్చింది.

సన్నగా వెన్నెల మా డాబాపక్కన వున్న బండరాళ్ళమీద పడుతోంది. ఆ రాళ్ళమీద పరిచిన పిడకలు గమ్మత్తుగా అవుపిస్తున్నాయి ఆ లేతవెన్నెల్లో, బావగారు ఏదో ఆలోచిస్తూ ఆకాశంలోకి చూస్తున్నారు. అక్కయ్య చిక్కుడుకాయల యీనెలు తీస్తోంది, తెల్లారి కూరకోసం.

ఏడుపులూ పెడబొబ్బలూ ఆగిపోయి, మళ్ళీ 'ఆయె బర సాత్ మే' రికార్డు మోగుతోంది. నాకు పిచ్చిలూ వెర్రులూ ఎత్తుతోంది ఆపాట వింటూంటే.

"పోనీ, మీ రాజయ్యకు ఇంకో రెండు రికార్డులన్నా కొనిద్దురూ—కాస్త వెరైటీ అయినా వుంటుంది."

బావగారు లోపల్లోపలనవ్వుకున్నారేగాని సమాధానం చెప్పలేదు.

"రాజయ్యపై సలు అంటులన్నా డేమిటి?" అన్నాను బావగారిని ఎలాగైనా మాట్లాడించాలని.

"ఇవాళ రెండో తారీకు కాబోలు. మర్చేపోయాను. నాకంటే రాజయ్యకే యీ తేదీ బాగా జ్ఞాపకం వుంటుంది," అంది అక్కయ్య బావగారితో.

"ఏమిట్రా ఆ రహస్యం నాకు చెప్పకూడదా?" అన్నాను అక్కయ్యతో.

"రాజయ్యకిమల్లే చీమూ నెత్తురూ ధారపోసి కష్టపడే వాళ్ళకి రెండో తారీకు జ్ఞాపకం వుంటుంది. మనకిమల్లే హాయిగాతిని కూచునేవారికి రెండో తారీకైనా, ఇరవయ్యో తారీకైనా ఒకటే!" అన్నారు బావగారు అక్కయ్యతో.

"చీమూ నెత్తురూ ధారపోస్తేమటుకు అది అక్కరకు వచ్చిందా? అంతా గంగపాలే అయింది. ఇంకా ఇంటెనిపట్టుకు దేవులాడి ఏంలాభం?" అంది అక్కయ్య చిక్కడుగింజలు గిన్నెలోకి ఎత్తుతూ.

"లాభంలేదు. ఆ మాట నిజమేకాని, పదేళ్ళు పెంచిన

కొడుకు చనిపోతే, ఇంకతిరిగిరాడని తెలిసికూడా తల్లిదండ్రులు ఏడవటం మానేస్తారా? తల్లి కడుపుకోత ఎలాపోతుంది! పాపం, రాజయ్యదికూడా అలాంటిశోకమే. కళ్ళలో ప్రాణాలు పెట్టుకుని ఇల్లు పరాయివాళ్ళకుపోతే; దుఃఖంరాక మరేమిటి? మమకారాలన్నీ ఇలాంటివే! నెలకి అయిదువందలు చేతుల్లో పడుతుంటే, నీకేం తెలుస్తుంది వాళ్ళబాధ!" అన్నారు బావగారు అక్కని వుద్దేశించి.

"అసలు సంగతేమిటి?" అన్నాను అక్కతో.

"ఆ సంగతంతా. అయన్నే అడుగు చెప్తారు."

♦ ♦ ♦

బావగారు మొదలుపెట్టారు;

అరిగిపోయిన ఆరికార్డు వెనకనున్న విరిగిపోయిన హృదయాలు మనకి కనబడవు. అసలు బయట మనుషుల్ని అర్థం చేసుకునే వోపిక మనలో లేనేలేదు. ఆ రాజయ్య పాచిపని వాడే. ఆ బాలమ్మ అలా తిడుతూనే వుంటుంది. కాని వారిద్దరిజీవితాలూ మనం వున్న ఈ డాబా పునాదుల్లో పడి నలిగిపోయాయి. వాళ్ళ చెమట బిందువులతో ఈ ఇంటి గోడలు లేచాయి"అన్నారు బావగారు వుద్రేక పూరితమైన మనసుతో.

"తాజ్ మహల్ నిర్మాణానికికూడా కూలీలే కావలసి వచ్చారు. అది రాజులు చెయ్యలేనిపని. అట్లాగే, ఈ యిల్లు మీరూ నేనూ కట్టలేము. అందుకని రాజయ్యలాంటివారు,

కూలిడబ్బులకు చెమటోడ్చి, కట్టివుంటారు. ఏ ఇంటి పునా
దుల్లో కాలివాళ్ళ స్వేదబిందువులు పడలేదు కనకనా!"
అన్నాను నా 'లాజిక్' అంతా వుపయోగించి.

"రాజయ్య కూలిడబ్బులకి చేసివుంటే ఎవరూ అంత బాధపడరు. అసలు అతనుకూడా ఇలా ఏడవడనుకుంటా. ఈ ఇంటిమీద పంచప్రాణాలూ పెట్టుకుని, తన రెక్కల కష్టంతో ఈ యిల్లు కట్టాడు. ప్రతి ఇటుకరాయీ తను మోశాడు. అందాకా ఎందుకు? పదివేలు కిమ్మతుచేసే యీ డాబా ఏడాది క్రింద దాకా ఆ రాజయ్యది అంటే నమ్ముతావా మాలతీ! యీ నాడు రాజయ్యకి ఆపూరి గుడిసె ఒక్కటే మిగిలింది," అన్నారు బావగారు నెమ్మదిగా.

నాకు ఆశ్చర్యంవేసింది. పాచిపనిచేసుకునే రాజయ్య, ఇంత ఇల్లు ఎలాకట్టించగలిగాడు? అంతకష్టపడి కట్టించినవాడు ఎలా పోగొట్టుకున్నాడు? 'రాదేచెలీ నమ్మరాదే చెలీ' అన్న రికార్డు రాజయ్య ఇంట్లోంచి వినబడుతోంది.

బావగారు చెప్పుకుపోతున్నారు:

"రాజయ్యకి పెళ్ళామూ బిడ్డలూ వున్నారు. మేస్త్రీ పని చేస్తూవుండేవాడు, బాలమ్మకి భర్త వున్నాడు; బిడ్డలులేరు. బాలమ్మ ఇంటిముందు వున్నరోడ్డు బాగుచేస్తున్న రోజుల్లో రాజయ్యకీ బాలమ్మకీ స్నేహం కుదిరింది. పాతికతులాల బంగారంతో బాలమ్మ రాజయ్యతో లేచివచ్చింది. అలా ఇద్దరూ రెండేళ్ళు నెలకి మూడురూపాయలు అద్దె యిచ్చుకుని చిన్నపాకలో వుంటూవచ్చారు. బాలమ్మ కూలిపనిచేస్తూ,

రాజయ్య మేస్త్రీ పని చేస్తూ ఒక ఎనిమిది వందలు కూడ బెట్టారు. కూడబెట్టిన డబ్బులో అయిదువందలతో యీడాబా స్థలంకొన్నారు. బాలమ్మ వంటిమీదవున్న బంగారం అమ్మగా సుమారు మూడు వేల రూపాయలు వచ్చింది. అదిపెట్టి తలుపులకీ దర్వాజాలకీ చెక్కలూ, డాబా కడ్డీలూ, సున్నం రాయీ, ఇలాంటివి కొని ఇల్లుకట్టడం ఆరంభం చేశారు.

"రోజూ రాత్రిళ్ళు రాజయ్యా బాలమ్మా ఇద్దరూ పునాదులు తవ్విపోశేవారు. పగలు పనిలోకివెళ్ళిఅతను నెలకి యాభై, బాలమ్మ నెలకి ముప్పై సంపాయించేవారు. ఇందులో ఒక ఇరవై రూపాయలతో పొట్ట గడుపుకొని, మిగతా అరవై, ప్రతినెలా ఇంటిమీద పెడుతూండేవారు.

"ఇసకవాళ్ళతో మంచిమాటఆడి, యిసకబళ్ళు కూలి ఖర్చు లేకుండా రాజయ్య తోలిపోసేవాడు. ఒక అర్ధరూపాయి తక్కువవుతుందని, రాయి అంతా సందు మొగదల్నించి, రాత్రిళ్ళు రాజయ్యా, బాలమ్మా మోసేవాళ్ళు.

"యిలా ఇల్లు సగం అయేవేళకి వాళ్ళదగ్గిరవున్న డబ్బు అయిపోయింది. ఇంటిగోడలు సగం లేచాయి. ఇంకా డాబా కడ్డీలూ, తలుపులూ, దర్వాజాలూ బిగించలేదు. దానికి అప్పుచెయ్యడం మొదలుపెట్టారు షావుకారు దగ్గిర. నెలనెలా వచ్చే అరవై రూపాయలూ వేస్తూ. సాధ్యమైనంత వరకూ కూలీ ఖర్చులు తగ్గించుకుంటూవస్తే, ఏడాది అయే వేళకి నాలుగు వేల అప్పుతో ఇల్లుపూర్తి అయింది.

"వంటయిట్లో పంపు, బాత్ రూములో పంపు, దొడ్లో

పంపు, పడకగది, ముందు హాలు, స్టోర్ రూము, ఇంటినిండా పెద్ద అల్మారలు, ఎలక్ట్రిసిటీ, యిలా అన్ని హంగుల్తో ఇల్లు తయారయింది. రెండు నెలలపాటు బాలమ్మ, రాజయ్య యితరుల సాయం లేకుండా; యిద్దరూ రాత్రిళ్ళు కూచుని ఇంటికి సున్నాలూ, తలుపులకి రంగులూ అన్నీ పూర్తి చేశారు.

"ఇల్లు పూర్తి అయే వేళకి ఇంటిమీద నాలుగు వేలు అప్పు వుంది. ఆ అప్పుకూడా యిల్లుతాకట్టుమీదే ఇచ్చాడు షావుకారు. షావుకారు రెండు పద్ధతులు చెప్పాడు. మామూలుగా మార్కెట్టులోవున్న రూపాయి వడ్డీ ఒక పద్ధతి, రెండోది తాకట్టు వాకట్టు పద్ధతి. ఇందులో వడ్డీ స్వల్పం. నాలు గేళ్ళకి నాలుగువేల రూపాయలకి వడ్డీ ఎనిమిది వందలు మాత్రమే అవుతుంది. అంటే ఐదు వంతులు. మొత్తం నాలుగువేల ఎనిమిది వందలు. ఆ లేసి నెలలకి రాజయ్య ఆరు వందల రూపాయలు కట్టాలి. ఓసారి కట్టకపోయినా తాకట్టు వాకట్టు అవుతుంది. వ్యవహార జ్ఞానంలేని రాజయ్యా తక్కువ వడ్డీ పద్ధతే కోరుకున్నాడు. ఇంత కష్టపడి ఇల్లుకట్టిన తను, ఆ లేసి నెలలకు ఆరువందలు కట్టలేకపోతానా అనుకున్నాడు.

"రాజయ్యా ఇంటిని డెబ్భై అయిదు రూపాయలకి అద్దె కిచ్చాడు. అద్దె, ఆ యింట్లోవాళ్ళే ప్రతి నెలా షావుకారు ఆఫీసులో కడ్తూండేవారు. పన్నులకి పైన యివ్వాల్సిన 150కి రాజయ్య, బాలమ్మ ప్రతిపైసా కూడబెట్టి కడుపు మాడ్చుకుని షావుకారు బాకీ చెల్లగడ్తూండేవారు. తిండి ఖర్చు కలసి వస్తుంది గదాఅని, బాలమ్మ ఈడా బాలో అద్దెకున్న వారింట్లో

పాచిపని, రాజయ్య యీ పక్కసందులో వారింట్లో తోట మాలి పనికీ కుదిరాడు. ఇలా ప్రతి దమ్మిడీ కూడబెట్టి అప్పు చెల్లగడుతూండేవారు.

తెల్లారగట్ల మూడింటికి లేచి అన్నం వండుకుని, డాబా యింట్లో పాచిపనిచేసి, అన్నం తిని మళ్ళీ మధ్యాహ్నానికి కాస్త మూట కట్టుకుని, యిద్దరూ పనిలోకి వెళ్ళేవారు. సాయంత్రం తిరిగివచ్చాక రాజయ్య తోటపనిలోకి, బాలమ్మ డాబాయింటి పనిలోకి ప్రవేశించేవారు. ఎక్కడన్నా కాస్త సున్నంపోతే మళ్ళీ సున్నం రాయటం, తలుపులు మీద పిల్లలు సుద్ద ముక్కతో గీస్తే తడిగుడ్డతో తుడవటం, వున్న ఆ కాస్త దొడ్లో మొక్కలు పాతడం, ఇలా రాత్రుళ్ళు పదింటిదాకా తాపత్రయపడేవారు యిద్దరూను.

“మొదటి రెండేళ్ళూ సావుకారు బాకీ సునయాసంగా తీర్చేసారు. ఐదో వాయిదా ఆరువందలుకూడా కట్టేశారు ఇంకొక్క మూడు వాయిదాలు చెల్లగడితే ఇల్లు తమ స్వంతం అవుతుంది, ఆ తర్వాత సుఖపడవచ్చు—అని కలలు కనే వారు. ఒకనాడు రోడ్డు బాగుచేస్తున్న కూలి పక్కనిల్చున్న రాజయ్య కాలుమీద పొరబాటున రాతిదిమ్మ వేశాడట. ఆ దెబ్బ నరానికి తగిలిందేమో, కాలు బాగా వాచింది పాపం! ఆ దెబ్బదెబ్బా మూడు నెలలు మంచం దిగలేదు రాజయ్య. రాజయ్య వుపచారంతో, మందుమాకులు తేవడంతో బాలమ్మ కూలిపని మానుకోవలసి వచ్చింది. అలాంటప్పుడే యింట్లో వున్నవారికి బదిలీ అవటంతో, ఇల్లు రెండు నెలలపాటు ఖాళీగా వుంది. ఏమైతేనేం, అన్నీ వుప్పెనలా

వచ్చిపడ్డాయి రాజయ్యమీద. ఆరో వాయిదా గడువు నాటికి చెల్లించలేకపోయాడు. ఆ అదను కోసమే ఎదురు చూస్తున్న షావుకారు, పదిహేను రోజుల నోటీసు యిచ్చి యిల్లు కాస్తా గుటుక్కున మింగి, పారమార్థికంగా రాజయ్యకి పన్నెండు వందల రూపాయలు ఇచ్చాడు.

రాజయ్య గొల్లున ఏడ్చాడు. బాలమ్మ నెత్తీ నోరూ బాదుకుంది! బ్రతిమాలింది! తిట్టింది. రాజయ్య రాసియిచ్చిన పత్రం షావుకారు పదిమందికీ చూపించాడు. 'షావుకారు మంచివాడు కాబట్టే, ఆ పన్నెండు వందలైనా ఇచ్చాడని' అన్నారు ఆ పత్రంచూసిన పదిమందీనూ.

కాని రాజయ్య హృదయంలోని అగ్నిహోత్రం ఎవరికి అర్థమవుతుంది? ప్రతి ఇటుకా, ప్రతి మేకూ తనువరి, అమర్చి కట్టినఇల్లు. పద్దెనిమిదివందలు తక్కువయి చెయ్యిజారిపోయింది. ఇదేనా న్యాయం! ఆ పన్నెండు వందలూ పెట్టి వాళ్ళావూరిల్లు, మన డాబా ఎదురుగుండావున్న పూరిల్లూ కొనుక్కున్నారు. మళ్ళా రాజయ్య మేస్త్రీపనికి వెళ్ళలేదు. ఇద్దరూ కూలిపని చేస్తూ చెరి ముప్పై సంపాయించుకుంటున్నారు. రాజయ్య యీ డాబానీ, యీ ప్రదేశాన్నీ వదిలి వెళ్ళలేదు. యీ డాబా తనది కాదని అతనికి తెలుసు. ఈ యింట్లో వాళ్ళని మేకు కొట్టవద్దని అడ్డుపెట్టే అధికారం తనకిలేదని రాజయ్యకు తెలుసు. అయినప్పటికీ గోడలో మేకు కొడుతూంటే అతని ప్రాణం గిలగిల్లాడుతుంది, రాజయ్య ఆత్మ ఈ ఇంటికీ పరిసరాలకూ అంకితమైపోయింది.

"బయట మనుష్యులు వద్దని, బయటవారికంటే తక్కువ

కూలికి, రాజయ్యా బాలమ్మలు సున్నంవేశారు యీ ఇంటికి, మొన్న దసరా పండగలకి. బయట మనుషులు జాగ్రత్తగా వెయ్యరట. అందుకని నన్ను బతిమిలాడుకుని వాళ్ళే సున్నం వేశారు ఈ ఇంటికి.

"ప్రతి రెంటో తారీఖున "అద్దె కట్టారా ?" అని విధిగా అడుగుతాడు రాజయ్యా తనజీతం అడగనే అడగడు. కాని షావుకారికిపోయే అద్దె అజ కావాలి రాజయ్యకు. ఒక్కొక్కప్పుడు ఇంటిమీద అతని ఆపేక్ష చూస్తే విసుగు కలుగుతుంది. కాని దీనంగా, ఆత్రంగా "పైసలు కడిగితివా ?" అని అడిగే రాజయ్యమీద ఎలా కోప్పడను ?

"వాళ్ళ రక్తమాంసాలు పీల్చిన యీ ఇంటిమీద వాళ్ళకున్న అభిమానం, అనురాగం చూస్తే నాకేదో బాధగా వుంటుంది. వీధివాకిలి చూడు, అద్దంలా ఎలా అలుకు తుందో బాలమ్మ ? జీవితంలో వారికి ఏ ఆశా లేదు కదా ! ఆ వూరికొంప తప్ప వారికి మరే ఆస్తీలేదు ఈ ప్రపంచంలో- కలలుకన్న యీ డాబా వారికి కాకుండా ఐపోయింది. కాని ఆ డాబా నీడలోనైనా వాళ్ళిద్దరూ జీవితాంతంవరకూ వుండ గలిగితే, పాపం ! ప్రతి బ్రతుకులోనూ ఎంత అగాధం.

"మేకుకొడితేనీ కేం!-"వెధవ గ్రామఫోనూ,-నువ్వూను అని రాజయ్యని చీదరించుకుంటే, అతని మనసెంత గాయ పడుతుంది ! ఈ డాబా నీడా, ఆ గ్రామఫోను పాటా అవేగా వారికి మిగిలింది !"

బావగారింక మాట్లాడలేకపోయారు నాకు కన్నీళ్ళు

తిరిగాయి. రాజయ్యా - బాలమ్మలు నిర్భాగ్యులు. వారి జీవితంలో "బర్సాత్" లేదు; గ్రామఫోను పాటలోనే వుంది ఆ "బర్సాత్."

ఇది కథ అనుకొంటున్నారా? కాదు సుమండీ! నిజం. ఖైరతాబాద్ స్టేషన్లో దిగి, ఆలిండియా రేడియో స్టేషనువున్న రోడ్డమ్మటే నడిచి, మూడో గల్లీలోకి తిరిగితే, యీనాటికూడా సాయంత్రం వేళ "ఆయే బర్సాత్ మే" పాటా, బాలమ్మ తిట్లూ మీకు వినపడకపోవు. నా మాట మీద నమ్మకం లేకపోతే, ఒక్కసారి వెళ్ళి చూసిరండి డాబా యింటిని.